క్లుప్తంగా

పరిశ్రమను సందర్శించిన విద్యార్థులు



పరిశ్రమను సందర్శించిన విద్యార్థులు

టెక్కలి: నైపుణ్య శిక్షణలో భాగంగా టెక్కలి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 9, 10 తరగతి విద్యార్థులు గురువారం టెక్కలి సమీపంలోని పైపుల పరిశ్రమను సందర్శించారు. ప్రధానోపాధ్యాయుడు రోణంకి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పరిశ్రమను సందర్శించిన విద్యార్థులు తయారీ విధానంపై అవగాహన చేసుకున్నారు. సందర్శనలో ఉపాధ్యాయులు కె.కె. రామిరెడ్డి, సూర్యనారాయణ, రవికిరణ్ ఉన్నారు.

హుండీ కానుకల లెక్కింపు



ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

టెక్కలి: టెక్కలిలో దేవదాయ ధర్మాదాయ శాఖా పరిధిలోని సంతోషిమాత ఆలయంలో భక్తులు హుండీల్లో వేసిన కానుకల లెక్కింపును గురువారం చేపట్టారు. కోటబొమ్మాళి కొత్తమ్మతల్లి ఆలయం ఈవో వి.రాధాకృష్ణ పర్యవేక్షణలో సిబ్బంది ఆదాయాన్ని లెక్కించారు. 122 రోజులకు రూ.23,317 ఆదాయం వచ్చినట్లు ఈవో మనస్వి తెలిపారు.

గిరిజన గ్రామాల సమస్యలు పరిష్కరించాలి

కంచిలి: నువాగడ పంచాయతీ పరిధిలోని 13 గిరిజన గ్రామాల్లో నెలకున్న సమస్యల్ని పరిష్కరించాలని జిల్లా గిరిజన సంఘం అధ్యక్షుడు సవర జయరాం డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రాన్ని గురువారం అందజేశారు. గిరిజనులు సాగు చేస్తున్న భూములకు పట్టాలు మంజూరు చేయాలని, ఉపాధిహామీ జాబ్ కార్డులు మంజూరు చేయాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో జిల్లా సంఘ ప్రతినిధులు నర్సింహులు, మోహనరావు, స్థానిక నేతలు జి.నరసింగో, మహేష్ గొమాంగో, మండల రైతు సంఘం నేత కప్ప గోపీనాథ్ ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి



మాట్లాడుతున్న అప్పలస్వామి

సోంపేట: మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని తహసీల్దార్ బి.అప్పలస్వామి అన్నారు. రైతు సేవాకేంద్రాలు, పీఏసీఎస్, డీసీఎంఎస్ సిబ్బందితో తహసీల్దార్ కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాణ్యతా ప్రమాణాలకు లోబడి తేమ శాతం 17 ఉన్న ధాన్యాన్ని కనీస మద్దతు ధరకు కొనుగోలు చేయాలన్నారు. ఏవో బి.నర్సింహమూర్తి, డీటీ పైడి కూర్మారావు, పీఏసీఎస్, డీసీఎంఎస్ ప్రతినిధులు హరణాధరావు, నారాయణరావు, రాజేష్ పాల్గొన్నారు.

పీటీఎంకు సన్నద్ధం కావాలి



సమావేశంలో ప్రజాప్రతినిధులు, అధికారులు

కవిటి: పాఠశాలల్లో ఈ నెల ఏడో తేదీన నిర్వహించనున్న పేరెంట్స్, టీచర్ల సమావేశానికి సిద్ధం కావాలని కవిటి సర్పంచ్ పూడి లక్ష్మణరావు అన్నారు. గురువారం కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల ప్రత్యేక అధికారి డాక్టర్ కచ్చి అప్పలస్వామి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంపీడీవో కె.శ్రీనివాసరెడ్డి, ఎంఈవో ధనంజయమజ్జి, హెచ్ఎం బెందాళం మల్లేశ్వరరావు, పంచాయితీ ఈఓ జి.వీరభద్రస్వామి ఉన్నారు.

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

కంచిలి: మండల పరిధిలో శుక్రవారం నుంచి గ్రామ రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు స్థానిక తహసీల్దార్ ఎన్.రమేష్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలో 58 రెవెన్యూ గ్రామాల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు రోజుకు రెండు చోట్ల గ్రామ సభలను నిర్వహిస్తామని చెప్పారు. జనవరి ఎనిమిదో తేదీన సభలు ముగిస్తాయన్నారు.

వాహనాల తనిఖీ

టెక్కలి రూరల్: ఇటీవల కాలంలో జరుగుతున్న ద్విచక్ర వాహనాలు చోరీలను అరికట్టడంలో భాగంగా పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. దీనిలో భాగంగా స్థానిక ఇందిరాగాంధీ జంక్షన్ వద్ద గురువారం సాయంత్రం ఎస్ఐ రాము, ఏఎస్ఐ వెంకటరమణ ఆధ్వర్యంలో వాహన తనిఖీలు చేపట్టారు. రికార్డులు సక్రమంగా లేని వాహనదారుల నుంచి అపరాధ రుసుం వసూలు చేశారు.

అన్నదాతకు సాయమేదీ?

- జాడలేని అన్నదాత సుఖీభవ
- అందని పెట్టుబడి సాయం
- సూపర్‌సిక్స్ హామీ గాలికి



కంచిలి మండలంలో అకాల వర్షాలకు నీట మునిగిన వరిచేను

కంచిలి: కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే రైతులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ఏటా రూ. 20 వేలు రైతుల ఖాతాకు జమ చేస్తామని చెప్పిన కూటమి సర్కారు ఆ హామీని విస్మరించింది. దీంతో రైతుల పైనే పెట్టుబడి భారం పడింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి రూ. 13,500 చొప్పున రైతులకు ఏటా వారి బ్యాంకు ఖాతాల్లో ఠంఛనుగా జమచేసేవారు. కూటమి ప్రభుత్వంలో ఇంతవరకు ఆ ప్రసక్తే ఎత్తకపోవడంతో రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ఇలా..

ఇచ్ఛాపురం నియోజకవర్గం పరిధిలో ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి, సోంపేట మండలాల రైతులకు ఖరీఫ్‌లో వరి పంటనే సాగు చేస్తుంటారు. వీరందరికీ గత ప్రభుత్వం మాదిరిగానే కూటమి ప్రభుత్వం కూడా అన్నదాత సుఖీభవ నిధులను రైతు ఖాతాలకు జమచేస్తుందని ఆశించిన అన్నదాత ఆశలు అడియాసలుగానే మిగిలిపోయాయి. కనీసం రబీ సీజన్‌కన్నా పథకాన్ని అమలు చేస్తారనుకుంటే అదీ లేకుండా పోయింది. దీంతో ఖరీఫ్, రబీ పంటల సాగుకు పెట్టుబడుల కోసం రైతులు అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకుంది. ఇచ్ఛాపురం నియోజకవర్గం వ్యాప్తంగా 35 వేల ఎకరాల్లో రైతులు వరి పంటను సాగు చేస్తున్నారు. అన్నదాత సుఖీభవ పథకం ఈ ఏడాది చెల్లించకపోవడంతో 38 వేల మంది రైతులు నష్టపోయారు.

పంటల బీమాకు స్వస్తి

వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రైతుల తరఫున పంటల బీమా ప్రీమియం ఈ–పంటలో నమోదు చేసిన ప్రతీ రైతుకు ప్రభుత్వమే ఇన్సూరెన్స్ కంపెనీవారికి చెల్లించేది. కూటమి సర్కారు వచ్చిన తర్వాత ఈ–పంట నమోదు చేసినప్పటికీ కేవలం ఆ నమోదు మద్దతు ధరకు మాత్రమే ఉపయోగపడేలా చేశారు. ఈ ఏడాది ఖరీఫ్‌కు ఎలాంటి పంటల బీమాను ప్రవేశపెట్టలేదు. దీంతో ఇటీవల కురిసిన అకాల వర్షాలకు ఇచ్ఛాపురం నియోజవర్గవ్యాప్తంగా సుమారు 500 ఎకరాల్లో పంట నీట మునిగింది. సుమారు 300 మంది రైతులు నష్టపోవాల్సిన పరిస్థితి దాపురించింది. వీరికి ఏర్పడిన నష్టానికి ఎవరు బాధ్యత వహిస్తారనే ప్రశ్న తలెత్తుతోంది. ఇక రబీ సీజన్‌కు బీమా మాత్రం రైతులే చెల్లించాలని కూటమి ప్రభుత్వం పేర్కొంది. చాలా మంది రైతులు పంటల బీమా చెల్లింపుపై అవగాహన లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. డిసెంబర్ 15వ తేదీ వరకు బీమా చెల్లింపునకు గడువు ఇచ్చారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిధులు విడుదల చేయాలి



ప్రభుత్వం రైతుల కోసం ప్రకటించిన అన్నదాత సుఖీభవ నిధులను రైతు ఖాతాలకు జమ చేయాలి. చాలామంది రైతులు ఈ నిధులు వస్తాయని సాగు పెట్టుబడి కోసం అప్పులు చేసుకొన్నారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి అన్నదాత సుఖీభవ నిధులు జమచేయాలి.

–కప్ప యుగంధర్, రైతు, కేసరపద గ్రామం, కంచిలి మండలం

అవగాహన కరవు



రైతులే పంటల బీమాను రబీ సీజన్ నుంచి చెల్లించాలని కూటమి ప్రభుత్వం ప్రకటించినప్పటికీ దీనిపై రైతులకు సరైన అవగాహన లేదు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఈ–పంట నమోదు చేసుకున్న ప్రతీ రైతుకు అవసరమైన విత్తన, ఎరువుల రాయితీలు, పెట్టుబడి సాయం, పంటకు మద్దతు ధర చెల్లించడంతోపాటు, బీమా ప్రీమియం కూడా ప్రభుత్వమే చెల్లించేది. కూటమి ప్రభుత్వం బీమా ప్రీమియాన్ని రైతులే చెల్లించుకోవాలని చెప్పడం దారుణం.

–పైల మాధవరావు, రైతు, కర్తలి గ్రామం, కంచిలి మండలం

పోలీసులు ఆకస్మిక తనిఖీలు



వజ్రపుకొత్తూరు మండలలోని పూండి వర్తక వ్యాపార కేంద్రంలో గురువారం పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఎస్ఐ బి.నిహార్ ఆధ్వర్యంలో ద్విచక్ర వాహనాలతో పాటు ఫోర్ వీలర్స్‌ను తనిఖీ చేసి సరైన పత్రాలు లేని వాహనాల నుంచి జరిమానా వసూలు చేశారు. అలాగే వైన్ షాపుల వద్ద ఉన్న ఫాస్ట్‌ఫుడ్, పాన్ షాపుల వద్ద మద్యం సేవించే యువకులను అదుపులోకి తీసుకున్నారు.

–వజ్రపుకొత్తూరు

ఫుట్‌పాత్ వ్యాపారం..



కాశీబుగ్గలోని అత్యంత రద్దీగా ఉండే కేటీరోడ్డులో విశాలమైన దుకాణాలను పలువురు వదిలేసి ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు సాగిస్తున్నారు. దీంతో అక్కడికి వచ్చిన వారి వాహనాలతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. కాశీబుగ్గ బస్టాండ్ నుంచి బయటకు వచ్చే మార్గం ఎదురుగా ఉన్న పలు వ్యాపార సంస్థల వద్ద ఈ పరిస్థితి నెలకుంది. ఈ విషయాన్ని మున్సిపల్ కమిషనర్ నడిపేట రామారావు వద్ద ప్రస్తావించగా.. పోలీసులతో కలిసి స్పెషల్‌డ్రైవ్ చేపడతామన్నారు. దుకాణాలు వదిలి రోడ్డుపైకి, ఫుట్‌పాత్‌పైకి వచ్చిన వారికి జరిమానా విధించి..సమస్యను పరిష్కరిస్తామన్నారు.

–కాశీబుగ్గ

నేరాలపై అవగాహన..



నేరాల నియంత్రణపై అవగాహన, అప్రమత్తత అవసరమని నౌపడ ఎస్సై జి.నారాయణస్వామి అన్నారు. సంతబొమ్మాళి మండలం మూలపేట పాఠశాలలో సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల వినియోగం, గుడ్, బ్యాడ్ టచ్‌తో పాటు పలు అంశాలపైన విద్యార్థులకు గురువారం అవగాహన కల్పించారు. ప్రలోభాలకు, మోసాల బారిన పడకుండా జాగ్రత్త పడాలని సూచించారు. అత్యవసర సమయాల్లో పోలీసులను సంప్రదించాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు ఎస్.రామారావు, ఉపాధ్యాయ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

–సంతబొమ్మాళి

ముగిసిన గ్రిగ్స్ పోటీలు



ఖోఖోలో తలపడుతున్న బాలికలు

కంచిలి: పెద్దశ్రీరాంపురం జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో రెండు రోజులుగా నిర్వహించిన మండలస్థాయి గ్రిగ్స్ పోటీలు గురువారం సాయంత్రంతో ముగిశాయి. చివరి రోజున అండర్–14 బాలురు, బాలికలకు వివిధ ఆటల పోటీలను నిర్వహించారు. ఖోఖో బాలుర విభాగంలో విజేతగా నువాగడ గిరిజన ఆశ్రమ పాఠశాల, రన్నర్‌గా కంచిలి జేఎంజే ఉన్నత పాఠశాల, బాలికల విభాగంలో పెద్దశ్రీరాంపురం జెడ్పీ హైస్కూల్, రన్నర్‌గా మకరాంపురం జెడ్పీ హైస్కూల్, కబడ్డీ బాలుర విభాగంలో కంచిలి జెడ్పీహెచ్ఎస్, రన్నర్‌గా మఠం సరియాపల్లి ఏపీ మోడల్ స్కూల్, బాలికల విభాగంలో విజేతగా జలంత్రకోట జెడ్పీహెచ్ఎస్, రన్నర్‌గా గోకర్ణపురం జెడ్పీహెచ్ఎస్, వాలీబాల్ బాలుర విభాగంలో విజేత బూరగాం జెడ్పీహెచ్ఎస్, రన్నర్‌గా మఠంసరియాపల్లి జెడ్పీహెచ్ఎస్, బాలికల విభాగంలో బూరగాం జెడ్పీహెచ్ఎస్, రన్నర్‌గా పెద్దశ్రీరాంపురం జెడ్పీహెచ్ఎస్, టెన్నికాయిట్ పోటీల్లో బాలుర విభాగంలో విజేతగా కంచిలి జెడ్పీహెచ్ఎస్, రన్నర్‌గా పెద్దశ్రీరాంపురం జెడ్పీహెచ్ఎస్, బాలికల విభాగంలో మకరాంపురం జెడ్పీహెచ్ఎస్, రన్నర్‌గా కంచిలి జెడ్పీహెచ్ఎస్, బ్యాడ్మింటన్ పోటీల్లో బాలుర సింగిల్ విభాగంలో విజేతగా జలంత్రకోట జెడ్పీహెచ్ఎస్, రన్నర్‌గా మకరాంపురం జెడ్పీహెచ్ఎస్, డబుల్ విభాగంలో విజేతగా జలంత్రకోట జెడ్పీహెచ్ఎస్, రన్నర్‌గా మకరాంపురం జెడ్పీహెచ్ఎస్‌లు నిలిచాయి. పోటీలు వివిధ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయుల పర్యవేక్షణలో జరిగాయి.

అసంబద్ధ విధానాలు విడనాడాలి



మాట్లాడుతున్న విజయ గౌరి

సోంపేట: అసంబద్ధ విధానాలను ప్రభుత్వం విడనాడాలని యూటీఎఫ్ నాయకులు అన్నారు. యూటీఎఫ్ బలపరిచిన పీడీఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం ప్రచారాన్ని నిర్వహించారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు లండ బాబూరావు మాట్లాడుతూ.. అధికారులు రోజురోజుకీ తీసుకువస్తున్న దుర్మార్గ విధానాలతో ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మండల ప్రధాన కార్యదర్శి కె.దొరబాబు, ప్రతినిధులు హేమచంద్రరావు, సుశీల, జానకీ రామయ్య ఉన్నారు.

రైల్వే ఉద్యోగ సంఘాలకు గుర్తింపు ఎన్నికలు



పలాస ఎస్ఎంఆర్ కార్యాలయంలో ఓటు వేసేందుకు వచ్చిన రైల్వే ఉద్యోగులు

కాశీబుగ్గ: పలాస రైల్వేస్టేషన్ పరిధిలో రైల్వే ఉద్యోగుల సంఘం గుర్తింపు ఎన్నికలు గురువారం జరిగాయి. స్టేషన్ పరిధిలో ఎస్ఎంఆర్ కార్యాలయంలో నిర్వహించిన ఎన్నికలలో ఇంజినీరింగ్, ఈఎస్‌డబ్ల్యూ, లోకో, ఎలక్ట్రికల్ ఆల్ డిపార్టెమెంట్లకు చెందిన 673 మంది ఉద్యోగులు పాల్గొన్నారు. 4, 5, 6 తేదీల్లో ఎన్నికల ప్రక్రియ దేశవ్యాప్తంగా జరుగుతుండగా.. పలాసలో సందడి నెలకుంది. జోనల్ పరిధిలో ఉన్నటువంటి ఈస్ట్ కోస్టు రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ తరఫున దాస్, శ్రామిక్ యూనియన్ తరఫున పత్నానిలు తలపడుతున్నారు. ఎవరికైతే 35 శాతం ఓట్లు వస్తాయో వారికి రైల్వేశాఖ గుర్తింపు ఇవ్వడంతో పాటు వారితోనే సంప్రదింపులు జరుపుతుంది. ఎన్నికల ప్రక్రియలో స్థానిక ఉద్యోగ సంఘ నాయకులు సిర్ల రాజశేఖర్, రామారావు, రవి చౌదరి, వంకల కృష్ణారావు, దొక్కరి శ్యాం, పి.వి.ఎస్.రావు పాల్గొన్నారు.

కిశోరి వికాసంపై శిక్షణ

ఇచ్ఛాపురం రూరల్: కిశోరి వికాసం కార్యక్రమం బాలికల బంగారు భవిష్యత్తుకు పునాది వేస్తుందని సీడీపీవో పురాణం నాగరాణి అన్నారు. ఇచ్ఛాపురం రూరల్ ఐసీడీఎస్ ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీఓ సమావేశ మందిరంలో గురువారం జరిగిన కిశోరి వికాసం శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. ఎంఈవో కురమాన అప్పారావు, ఇన్‌చార్జి ఎంపీడీవో కె.రామారావు, ప్రభుత్వ వైద్యురాలు డాక్టర్ వై.కల్యాణి, యువసూర్య చారిటేబుల్ ట్రస్ట్ చైర్మన్ ఎం.రాంబాబు పాల్గొన్నారు.

విద్యార్థి ప్రతిభ

వజ్రపుకొత్తూరు: గోవిందపురం ఉన్నత పాఠశాల విద్యార్థి అనకాపల్లి అరవింద్ ఓఎన్‌జీసీ సౌజన్యంతో మోజో సంస్థ నిర్వహించిన ఆన్‌లైన్ పరీక్షలో ఉన్నత ప్రతిభ కనబరిచారు. దీంతో విద్యార్థికి ఆ సంస్థ అందించిన రూ.15 వేలు చెక్‌ను హెచ్ఎం కె.హరిబాబు గురువారం అందజేసి అభినందించారు. ఉపాధ్యాయులు జి.లక్ష్మణరావు, సీహెచ్ ఉమారావు, సీతమ్మ, సత్యరాజు, రసీద్, నాగరాజు, రాజశేఖర్, ఉమామహేశ్వరి, పార్థసారధి, ధర్మారావు ఉన్నారు.

ఘనంగా పాస్టర్స్ క్రిస్మస్ వేడుకలు



ప్రార్థనలు చేస్తున్న పాస్టర్స్ ఫెలోషిప్ ప్రతినిధులు

ఇచ్ఛాపురం: ఆంధ్రా బాప్టిస్ట్‌చర్చి ఆధ్వర్యంలో పాస్టర్స్ క్రిస్మస్ వేడుకలను గురువారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. పీవీకే ఫంక్షన్‌హాల్లో ప్రత్తి విజయ్‌కుమార్ పర్యవేక్షణలో జరిగిన వేడుకల్లో పాస్టర్స్ కుటుంబ సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పాస్టర్స్ ఫెలోషిప్ జిల్లా చైర్మన్ డి.ఎస్.వి.ఎస్.కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై క్రీస్తు సందేశాన్ని వినిపించారు. 45 మంది పాస్టర్లకు గ్రైండర్లను పంపిణీ చేశారు. పాస్టర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కోఆర్డినేటర్ ప్రత్తి అన్వేష్, ఆంధ్రబాప్టిస్ట్ చర్చి కార్యదర్శి ఎం.వి.ఎస్.ఎన్.మూర్తి, కోశాధికారి వజ్రపు వెంకటేష్, పాస్టర్స్ ఫెలోషిప్ ప్రతినిధులు ఎలియా ప్రభుదాస్, సందరరాజు, బిమ్మో బెహర పాల్గొన్నారు.

సబ్సిడీపై విత్తనాలు పంపిణీ



విత్తనాలు అందజేస్తున్న దృశ్యం

కవిటి: రబీ సీజన్‌లో బీలప్రాంత రైతులు ఆరుతడి పంటల సాగు చేయాలని మండల వ్యవసాయాధికారి బడగల దుర్గాప్రసాద్ అన్నారు. కవిటి మండల వ్యవసాయశాఖ కార్యాలయంలో రబీసీజన్‌కు సంబంధించి రైతులకు సబ్సిడీపై రాగులు, మినుము విత్తనాలను గురువారం పంపిణీ చేశారు. ఏఈవో బి.శ్రీకల్యాణ్, వీఏఏ ఎం.సమన్వయి, బి.రమేష్, బి.కామరాజు, ఆరంగి మధుబాబు ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరం

నందిగాం:స్థానిక కొత్తమ్మతల్లి డాక్టర్స్ ప్లాజా వారి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఉచిత హృద్రోగ వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. శ్రీకాకుళానికి చెందిన కిమ్స్ ఆస్పత్రి కార్డియాలజిస్ట్ కెల్లి సతీష్, డాక్టర్ శ్రీలక్ష్మీ, డాక్టర్ ఝాన్సీలు 128 మందికి వివిధ వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. శిబిరంలో కోఆర్డినేటర్ రాజశేఖర్, అప్పలనాయుడు ఉన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న కళాకారులు

కాశీబుగ్గ: స్థానిక డాక్టర్ కణితీస్ ప్రభుత్వ ఐటీఐ కళాశాల విద్యార్థులకు ఎయిడ్స్‌పై కళాజాతా ద్వారా గురువారం అవగాహన కల్పించారు. శ్రీకాకుళానికి చెందిన శ్రీసూర్యకుమారి కళాబృందం సభ్యులు ఎయిడ్స్‌పై వివరించారు. ప్రాజెక్టు మేనేజర్ ఎం.మాధవరావు, ఎన్జీఓ సంస్థ ప్రతినిధి ఎం.హసన్ ఉల్లా, అధ్యాపకులు పూన వెంకటరమణ ఉన్నారు.

'నేలను కాపాడుకుందాం'



మాట్లాడుతున్న ఏవో నర్సింహమూర్తి

సోంపేట: భావితరాల కోసం నేలను కాపాడుకోవాలని వ్యవసాయాధికారి బి.నర్సింహమూర్తి అన్నారు. ప్రపంచ ధరిత్రి దినోత్సవం సందర్భంగా పాత్రకొండ ఉన్నత పాఠశాలలో గురువారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. నేల ప్రాధాన్యత, సంరక్షణను వివరించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

కంచిలి: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని స్థానిక ఎస్సై పి.పారినాయుడు అన్నారు. అంపురం జంక్షన్ వద్ద 'సంకల్పం' అవగాహన కార్యక్రమాన్ని స్థానికులతో గురువారం సాయంత్రం నిర్వహించారు. డ్రగ్స్, గంజాయి, సైబర్ క్రైమ్ తదితర అంశాలపట్ల అప్రమత్తంగా ఉండాలని అవగాహన కల్పించారు.

జగన్‌ను కలిసిన ఇచ్ఛాపురం నేతలు



కంచిలి: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో ఇచ్ఛాపురం నియోజకవర్గ నాయకులు

కంచిలి/కవిటి: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఇచ్ఛాపురం నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాకు చెందిన నాయకులతో తాడేపల్లిలోని రాష్ట్ర పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశం అనంతరం జిల్లా పార్టీ అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్‌తో కలిసి నియోజకవర్గ నాయకులు జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. జగన్‌ను కలిసిన వారిలో జెడ్పీ చైర్‌పర్సన్, ఇచ్ఛాపురం నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త పిరియా విజయ, జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఇచ్ఛాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి సంతోష్, ఎంపీపీలు డాక్టర్ నిమ్మన దాస్, పైల దేవదాస్‌రెడ్డి, బోర పుష్ప, ఇచ్ఛాపురం పట్టణ పార్టీ అధ్యక్షుడు ప్రకాశరావు పట్నాయక్, మండల పార్టీ అధ్యక్షులు సిలగాన భాస్కరరావు, మృత్యుంజయరావు, కవిటి మండల పార్టీ అధ్యక్షుడు కడియాల ప్రకాశ్, పాతిన రాజశేఖర్ హనుమంతు వెంకటేశ్వరరావు, వానతవిటయ్య, ఎస్ హేమసుందరరాజు, దుబ్బ వెంకటరావు, అన్నెపు రామారావు, బుడ్డా మోహన్‌రెడ్డి కలిశారు. ఉన్నారు.



జగన్‌మోహన్‌రెడ్డితో కవిటి మండల పార్టీ అధ్యక్షుడు కడియాల ప్రకాష్



జగన్‌తో ఉప్పాడ రాజారెడ్డి



జగన్‌తో మాజీ ఎంపీపీ కారంగి మోహనరావు

ఇచ్ఛాపురం రూరల్: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఇచ్ఛాపురం మండలానికి చెందిన పార్టీ నాయకుడు ఉప్పాడ రాజారెడ్డి, మాజీ ఎంపీపీ కారంగి మోహనరావులు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇచ్ఛాపురం మండలం రాజకీయ పరిస్థితులపై ఆయన దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు.



కాశీబుగ్గ: జగన్‌మోహన్‌రెడ్డితో మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు, శిష్టు గోపి తదితరులు

ఇచ్ఛాపురం: మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ఇచ్ఛాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, సంతోష్ దంపతులు మర్యాదపూర్వకంగా కలిశారు. మున్సిపాలిటీ ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు అండగా నిలవాలని జగన్ సూచించినట్లు రాజలక్ష్మి తెలిపారు..



ఇచ్ఛాపురం: జగన్‌తో చైర్‌పర్సన్ రాజలక్ష్మి దంపతులు

జగన్‌తో పలాస నాయకులు..

కాశీబుగ్గ: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పలాసకు చెందిన పలువురు నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి శిష్టు గోపి, మున్సిపల్ వైస్ చైర్మన్ బోర కృష్ణారావు, అధికార ప్రతినిధి దుర్గాశంకర్ పండా, నాయకులు ఉంగ సాయిక్రిష్ణ, పోతనపల్లి హరి మాజీ సీఎంను కలిసిన వారిలో ఉన్నారు.



జగన్‌తో టెక్కలి నాయకులు..

టెక్కలి: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్, నందిగాం ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి, టెక్కలి, సతంబొమ్మాళి పీఏసీఎస్ మాజీ చైర్మన్లు సత్తారు సత్యం, కెల్లి గోవింద్,





టెక్కలి: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో టెక్కలి నాయకులు పేరాడ తిలక్ తదితరులు..

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నందిగాం: మండలంలోని కొండలప్రాంత మదనాపురం సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరాలో శుక్రవారం అంతరాయం కలుగుతుందని టెక్కలి ఈఈ జి.శంకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల పరిధిలో చెట్టు కొమ్మలు కొట్టడంతో పాటు మెయింటెనెన్స్ పనుల్లో భాగంగా ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం వరకు మదనాపురం, హర్షబడ, కల్లాడ, దిమ్మిడిజోల, దీనబంధుపురం, సవరలింగుపురం, కైజోల, సవరరామక్రిష్ణాపురం తదితర గ్రామాల్లో.. అలాగే కొత్తగ్రహారం సబ్ స్టేషన్ పరిధిలోని కొత్తగ్రహారం, దేవుపురం ఫీడర్లలో సరఫరాలో అంతరాయం ఉంటుందని.. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.